క్లుప్తంగా

ఘనంగా గోగులమ్మ తల్లి తీర్థం


ప్రత్యేక అలంకరణలో గోగులమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం శివార్లలో కొలువైన గోగులమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెంతో పాటు సమీప గ్రామాలైన పందలపాక, తొస్సిపూడి, బలభద్రపురం, కొప్పవరం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ


కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కాలభైరవస్వామి, గణపతి, దక్షిణామూర్తిల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు భాస్కరశర్మ, వెంకట రమణశర్మ, రమణశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వూరి పాపారెడ్డి, త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకట రామారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సత్తి వెంకటకృష్ణారెడ్డి, సత్యవేణి, సత్తి సత్యనారాయణరెడ్డి, గంగాభవాని, సత్తి బ్రహ్మానందరెడ్డి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు


ఈలకొలనులో సాగవుతున్న మొక్కజొన్న పంట

రంగంపేట: మండలంలో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా సాగుతోంది. ఖరీఫ్ వరి కోతలు కోసిన పొలాల్లో రబీ సీజన్‌లో భాగంగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మొక్కజొన్న పంట ప్రస్తుతం మండలంలోని అన్ని ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు.

సారా బట్టీలపై దాడులు


సారా బట్టీలపై దాడులు చేసిన ఎస్సై రామకృష్ణ సిబ్బంది

సీతానగరం: లంక భూముల్లో సారా బట్టీలపై ఎస్సై టి.రామకృష్ణ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. సుమారు పది వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆదివారం ముగ్గళ్ల నుంచి బొబ్బిల్లంక వరకూ లంక భూముల్లోని సారా తయారీ బట్టీలపై దాడులు జరిపారు. ఆరు బట్టీలను ధ్వంసం చేసి, 50 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. డ్రమ్ములు, సారా తయారీ పాత్రలు, 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీల నిర్వాహకులు పరారయ్యారని, కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

జగనన్నతోనే షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి

- దళితుల సంక్షేమానికి, అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా పాలన
- త్వరలో నియోజకవర్గ స్థాయిలో దళితులతో ఆత్మీయ సమ్మేళనం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


హాజరైన షెడ్యూల్డ్ కులాల ప్రజలు

రాజానగరం: షెడ్యూల్డ్ కులాల వారి సమగ్ర అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో షెడ్యూల్డ్ కులస్తులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమాజంలో వెనుక బడిన వర్గాలను ఆర్థికంగాను, రాజకీయంగాను ఎదిగేలా అవసరమైన తోడ్పాటునందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.2.70 లక్షల కోట్లు వెచ్చించి, ఆయా వర్గాలను ఆర్థికంగా ఆదుకున్న ఘనత జగనన్న సర్కారుదేనన్నారు. కేవలం ఓట్ల కోసం లేనిపోని కపట ప్రేమలు కురిపించడం, అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ గాలి కొదిలేసి, దగా చేయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. చెప్పింది చేయడం, చేసేదే చెప్పడం జగనన్న నైజమన్నారు. ఈ ఇద్దరి నేతల తీరును నిశితంగా పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. అందరి సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్న సర్కారుకు మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జన్మభూమి కమిటీల వేధింపులు మరిచారా?

టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏ పని కావాల్సి వచ్చినా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, పచ్చ చొక్కా వారికే పథకాలు దక్కేవని చంద్రబాబు పాలనా తీరును ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గుర్తు చేశారు. జన్మభూమి కమిటీల వేధింపులకు అడ్డూఅదుపూ ఉండేది కాదన్నారు. అదే జగనన్న అధికారంలోకి వచ్చాక గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చి, ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావడమే కాకుండా, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలన్నింటినీ సకాలంలో, సక్రమంగా అందిస్తున్నారన్నారు. ఇలా నియోజకవర్గంలో రూ. 1148 కోట్లు అభివృద్ధి జరిగితే రూ.1,158 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక చేయూతను ఇచ్చినట్టు వివరించారు. అలాగే పేదల సొంతింటి కలను సాకారం చేసిన నాయకుడు, పాలకుడు కూడా జగనన్నే అన్న విషయాన్ని ఏ ఒక్కరూ మరువరాదన్నారు. అన్నదాతలకు అడుగడుగునా తోడుగా ఉండేలా ఆర్‌బీకేలతో విస్తృత సేవలందిస్తున్న వైనాన్ని వివరించారు. ఆడపడచులకు ఆర్థిక భరోసానందిస్తూ అమలు చేస్తున్న అమ్మ ఒడి, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలను కూడా గుర్తు చేశారు. స్థానికుల అభ్యర్థన మేరకు గ్రామంలో దాదా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి విశ్వబ్రాహ్మణుల విశిష్ట సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న రంగరాజభట్టర్

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో విశ్వబ్రాహ్మణులు విశిష్ట సేవలందిస్తున్నారని ఆలయ ధర్మకర్త ఎస్పీ రంగరాజభట్టర్ అన్నారు. కోరుకొండలోని కొచ్చెర్ల, తగరంపూడి తదితర కుటుంబాల వారు స్వామివారికి అనాదిగా సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం స్వామివారి కల్యాణ మంటపంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కుటుంబ సమేతంగా స్వామివారికి సేవలందిస్తున్న విశ్వ బ్రాహ్మణులపై గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ భర్త కర్రి గణేష్ అభ్యంతరకరంగా మాట్లాడారని తప్పుపట్టారు. స్వామివారికి భక్తిభావంతో నిర్వహిస్తున్న సేవలు డబ్బు కోసమే అనడం సబబు కాదన్నారు. రథాన్ని తయారుచేయడం మొదలు.. రథోత్సవం వరకూ విశ్వబ్రాహ్మణుల సేవలు అమితంగా ఉంటాయన్నారు. కుటుంబాల సమేతంగా సేవలు అందుతున్నాయన్నారు. డబ్బుకు, వారి సేవలకు ముడిపెట్టడం సహేతుకం కాదన్నారు. విశ్వబ్రాహ్మణుల సమాఖ్య నాయకుడు ఈశ్వరుడు మాట్లాడుతూ డబ్బు కోసమే స్వామి వారి కార్యకలాపాలు చేస్తున్నట్టు మాట్లాడిన కర్రి గణేష్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామంలో ఆందోళనలు చేపడతామన్నారు.

భూమిని చేపల చెరువుగా మార్చుకొని చేపలు పెంచుకొను హక్కునకు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

[illegible] ది.18-03-2024 ఉదయం 10 గం.లకు [illegible]

1.	పెదపూడి గ్రామం, పెదపూడి మండలం	62	ఎ.6.14	1,50,000/-

[illegible]

పెదపూడి
ది.02-03-2024
సెల్ నెం. 9441209704, 7382577045
ఐ.సత్యనారాయణ
కార్యనిర్వహణాధికారి

హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదే..


రఘునాథపురంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- రఘునాథపురం, దివాన్‌చెరువుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గత ప్రభుత్వాల మాదిరిగా అధికారంలోకి వచ్చాక గాలికి వదిలేయకుండా, మాట తప్పని, మడమ తిప్పని నైజంతో 99.5 శాతం పైబడి నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని గర్వంగా చెప్పగలుగుతున్నానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రఘునాథపురం, దివాన్‌చెరువుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. వీటిలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి, ఆయా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ఏ మేరకు వారికి అందాయో డేటా సహా వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వాటిని కొనసాగించాలంటే రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. అందుకు ప్రజలంతా రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, పలివెల స్వామి, మార్గాని శ్రీను, పీటర్ పాల్గొన్నారు.

సంక్షేమంతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం


అనపర్తి సావరంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి పాతవూరు మహాలక్ష్మీపేట, అనపర్తి సావరం, దేవస్థానం కాలనీల్లో రూ.1.34 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను, మండలంలోని కుతుకులూరు కూటేశ్వర కాలనీలో పడాల రామారెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఆర్‌కే బస్ స్టాండ్‌లను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే సీఎం జగనన్న సుపరిపాలనకు గీటురాళ్లన్నారు. అక్కా చెల్లెమ్మలు సమాజంలో సగౌరవంగా జీవనం సాగించేందుకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి వారికే నేరుగా అందిస్తున్నారన్నారు. గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతున్నామన్నారు. నవరత్న పథకాలతోపాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కుతుకులూరు, అనపర్తి సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, వారా కుమారి, ఉపసర్పంచ్‌లు సబ్బెళ్ల నాగిరెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, మండ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: దిగజారుడు రాజకీయాలు మానుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రతిపక్ష నేతలను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటు బ్యాంకు రాజకీయాలకు తెర లేపిన వివిధ ప్రతిపక్ష పార్టీ నేతలు, నాయకులు కూటమి పేరుతో తమ కల్లబొల్లి మాటలతో ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు జరుగుతున్న సంగ్రామమన్నారు. ఈ ఎన్నికల్లో పేదల పక్షాన నిలిచి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలకు లోను కాకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంపై దృష్టి సారించాలని సూచించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో అనపర్తిలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి తాను స్వయంగా పిలవకపోయినా సంఘీభావం తెలియజేయడంతో పాటు తనకు బాసటగా నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాదిగా స్వచ్ఛందంగా, సంఘటితంగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తనపై చేసిన ఆరోపణలకు ఒక నిర్దిష్టమైన సమాధానం ఇచ్చానన్నారు.





పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం


రఘునాథపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


పెద్దాడలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి ప్రత్యూష

రాజానగరం: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘునాథపురంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాజానగరం పీహెచ్‌సీ పరిధిలో 98 శాతం పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. ఐదేళ్లలోపు చిన్నారులు 5,197 మంది ఉండగా, 5,102 మందికి పోలియో చుక్కలు వేశారు.

బిక్కవోలు: పోలియో రహిత సమాజానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా మహిళా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి అన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా కొంకుదురు పీహెచ్‌సీ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల నిండు జీవితానికి రెండు పల్స్‌పోలియో చుక్కలు మేలు చేస్తాయని, ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఏ ఒక్క చిన్నారిని వదలకుండా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: పోలియో మహమ్మారిని సమాజం నుంచి పారదోలడానికి అందరూ కృషి చేయాలని పెద్దాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డీహెచ్ ప్రత్యూష అన్నారు. ఆమె పెద్దాడలో చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపున్న 4,336 మంది చిన్నారులకు గాను 4,075 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. సంపర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 94 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని వైద్యురాలు శిరీష తెలిపారు.

సీతానగరం: మండలంలో 96 శాతం పోలియో చుక్కలు వేసినట్టు సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎస్ రాజు తెలిపారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ జ్యోత్స్న ముగ్గళ్ల స్కూల్‌లో ప్రారంభించారు. సీతానగరం స్కూల్లో వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, ఆర్బీకే మండల చైర్మన్ వలవల వెంకట్రాజు.. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలు మండలంలో 5,689 మంది ఉండగా, వీరిలో 5,469 మందికి పోలియో చుక్కలు వేసి 96 శాతం పూర్తి చేశారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.

అనపర్తి: రెండు పోలియో చుక్కలు వేయిస్తే చిన్నారుల బంగారు జీవితానికి వెలుగవుతాయని సర్పంచ్ వారా కుమారి అన్నారు. అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కేంద్రాన్ని ఆమె ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలియో నిర్మూలన ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మధురపూడి: పోలియో రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని కోరుకొండ మండల జెడ్పీటీసీ కర్రి సూర్యనాగేశ్వరరావు అన్నారు. ఆదివారం దోసకాయలపల్లి కృష్ణుని గుడి వద్ద పోలియో చుక్కల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వి.కోటేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ ఎం.వర్మారెడ్డి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.